క్లుప్తంగా

పీహెచ్‌సీ డాక్టర్‌గా రాకేష్‌రెడ్డి



పాన్‌గల్‌: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా పి.రాకేష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పీహెచ్‌సీకి కొంత కాలంగా రెగ్యూలర్‌ డాక్టర్‌ పోస్టు ఖాళీగా ఉండటంతో కడుకుంట్ల పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న రాకేష్‌రెడ్డిని పాన్‌గల్‌ పీహెచ్‌సీకి రెగ్యూలర్‌ డాక్టర్‌గా నియమించారు. మండల ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తోడ్పాటుతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయనతో పాటు పీహెచ్‌సీ అదనపు డాక్టర్‌ రాజశేఖర్‌, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ బలోపేతానికి కృషి



కొత్తకోట రూరల్‌ (పెద్దమందడి): మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన యాదగిరిగౌడ్‌ను కాంగ్రెస్‌ యూత్‌ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌ యూత్‌ జనరల్‌ సెక్రెటరీ నియమిస్తూ.. నియామక పత్రం అందించారని కాంగ్రెస్‌ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్‌ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన శివసేనారెడ్డికి, యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలను సమన్వయ పరుస్తూ ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. యాదగిరిగౌడ్‌ను జనరల్‌ సెక్రెటరీ నియమించడంపై స్థానిక నాయకులు ఆటో మల్లయ్య, ఖదీర్‌, సందడి బుచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మన ఊరు–మన బడి పనుల పరిశీలన



పాన్‌గల్‌: మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌ పరిశీలించారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వంద శాతం పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రీన్‌ చాక్‌ బోర్డును పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్‌ ఏఈ సత్తయ్య , హెచ్‌ఎం నారాయణ, పంచాయతీ కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



కొత్తకోట: పట్టణ సమీపంలో నూతంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం, 108 అడుగుల విగ్రహం ఏర్పాటు కోసం మండలంలోని కానాయపల్లికి చెందిన దారమోని సుప్రజ, రామరాజు దంపతులు తమ వంతు సహాయంగా రూ.51వేలను కుటుంబ సభ్యులు సత్యనారాయణ, రాములు, బాలరాజు, నాగరాజులతో కలిసి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్‌, గంగాధర్‌శెట్టి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌, తిరుపతయ్య, నరేష్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు.

రేంజర్ల రాజేష్‌ దిష్టిబొమ్మ దహనం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుభాష్‌ చౌరసాలో హిందూవాహిని సంఘం ఆధ్వర్యంలో బుధవారం రేంజర్ల రాజేష్‌ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేంజర్ల రాజేష్‌ హిందూ వ్యతిరేకంగా సరస్వతి అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, హిందూ దేవతలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడే వారిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు.

కరపత్రాల పంపిణీ

వనపర్తి టౌన్‌: పట్టణంలో గురువారం జరగనున్న సంఘర్షక జీపు యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్‌ ప్రైవేట్‌ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి రాము అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని సమావేశమై కరపత్రాలను పంపిణీ చేశారు. మోటార్‌ వాహన చట్టం 2019ని సవరించాలని డిమాండ్‌ చేశారు.

మురుగుతో సావాసం

- భరించలేని దుర్వాసన
- విషజ్వరాల బారిన చిన్నారులు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు



అమరచింతలోని మసీదు వెనకాల నిల్వ ఉన్న మురుగును చూపుతున్న కాలనీవాసులు

అమరచింత: గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన అమరచింత పట్టణం నేటికీ అభివృద్ధిలో ముందడుగు వేయలేకపోతుంది. ఒకటో వార్డులోని రాంనగర్‌, శివాజీ నగర్‌లో డ్రెయినేజీలోని మురుగు ముందుకు వెళ్లలేక అక్కడే నిల్వ ఉండటంతో కాలనీకి చెందిన చిన్నారులు, ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని కాలనీవాసులు ఆందోళనకు దిగారు. జామియా మసీదు వెనకాల ఉన్న వ్యవసాయ పొలంలో మురుగు నిల్వ ఉండటంతో పందులకు ఆవాసంగా మారింది.

దోమలు వృద్ధి

ఈగలు, దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులు, పాలక మండలి పట్టించుకోవడం లేదంటూ సోమవారం కాలనీ మహిళలు నిరసన చేపట్టారు. ఈమేరకు మసీదు వెనకాల నిల్వ ఉన్న మురుగు వద్ద సమీప పరిసరాలు, పారిశుద్ధ్యం ఎలా లోపించాయి అన్న విషయాలపై చర్చించారు. పలు సందర్భాల్లో మున్సిపాలిటీ అధికారులకు, పాలక వర్గానికి ఇక్కడి ప్రధాన సమస్యను విన్నవించినా పట్టించుకోలేక పోతున్నారని ఆరోపించారు.

నాగుల బావిలోకి మురుగు

రాంనగర్‌ నుంచి వస్తున్న మురుగు కాల్వల నీరు శివాజీనగర్‌లోని నాగుల బావిలోకి వదులుతుండటంతో బావిలోని నీరు అంతా దుర్గంధంగా తయారైంది. దోమల వ్యాప్తి ఎక్కువైందని ఫిర్యాదు చేసిన పట్టించుకోవట్లేదని వాపోయారు. మసీదుకు చెందిన రెండు ఎకరాల వ్యవసాయ పొలంలో మురుగు నిల్వ ఉండటంతో వ్యవసాయానికి పనికి రాని పొలంగా మారిందంటున్నారు. మూడేళ్ల కాలంలో వీటి గురించి ఎన్నో సందర్భాల్లో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా సమస్యల పరిష్కరించకపోతే కాలనీవాసులు బుధవారం మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

రోగాల బారిన పడుతున్నాం



ఒకటో వార్డులో డ్రెయినేజీల నీరు ముందుకు వెళ్లడానికి మార్గం లేక నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు, పందుల సంఖ్య పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎన్నో పర్యాయాలు అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవట్లేదు. ఈసారి ఎన్నికల్లో ఓటు వేయం. పారిశుద్ధ్యంపై పట్టించుకోని నాయకులు వస్తే సమస్య గురించి నిలదీస్తాం.

– రామేశ్వరమ్మ, శివాజీనగర్‌ కాలనీ

సమస్య పట్టించుకోరు



కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యల గురించి కౌన్సిలర్‌తో పాటు చైర్‌పర్సన్‌ దృష్టికి తీసుకెళ్లినా సమస్యను నేటికి పరిష్కరించట్లేదు. ఎక్కడి నుంచో వచ్చిన మురుగు ఇళ్ల మధ్య నిల్వ ఉండటంతో చిన్నారులకు విష జ్వారాలు వస్తున్నాయి. గత నెలలో మూడేళ్ల చిన్నారి డెంగ్యూ లక్షణాలతో మృతి చెందినా అధికారుల్లో మాత్రం చలనం లేదు.

– వంశీ, శివాజీ నగర్‌

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో గురువారం మామిడిలో సోకే తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల ఉద్యాన వన శాఖ అధికారి కృష్ణ తెలిపారు. 'రైతులో చిగురిస్తున్న ఆశలు' అనే శీర్షికన ఈ నెల 2వ తేదీన సాక్షి దినపత్రికలో మామిడి తోటలకు సోకిన తెగుళ్లపై కథనం ప్రచురితం కావడంతో.. స్పందించిన అధికారులు మామిడి రైతులకు సస్య రక్షణ చర్యలు అనే అంశంపై శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నారు.

చిన్నంబావి: వీపనగండ్ల, పాన్‌గల్‌, చిన్నంబావి మండలాల రైతులకు గురువారం వీపనగండ్ల రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కేవీకే, మదనాపురం ఉద్యాన శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మామిడిలో పూత, పిందె, కాయ దశలో వచ్చే తెగుళ్లు, చీడపీడలు వాటి నివారణ పద్ధతులపై పలు సందేహాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, రైతులు హాజరవ్వాలి సూచించారు.

నిరసనలను జయప్రదం చేయండి

పాన్‌గల్‌: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేకతను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన నిర్వహించే నిరసనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కీముల ప్రైవేటీకరణ, కార్మికులకు కనీస వేతనాలు, నిత్యావసర ధరల నియంత్రణ, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత వంటి వాటిని సాధించడం కోసం నిర్వహించే దేశ వ్యాప్త నిరసనల్లో ఆయా కార్మిక వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థినికి అభినందన

కొత్తకోట: 75ఏళ్ల స్వతంత్ర భారతం వజ్రోత్సవ వేడుకల సందర్భంగా 2022 అక్టోబర్‌ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని నాగెల్లి సురేష్‌ సంపాదకత్వంలో రెండు రాష్ట్రాల కవుల నుంచి కవితలను ఆహ్వానించారు. ఇందులో భాగంగా మండలంలోని అమడబాకుల జెడ్పీహెచ్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.ప్రవళిక రాసిన 'బాపూజీ వజ్ర సంకల్పానికి వజ్రోత్సవం' అనే కవితా అర్హత పొందినట్లు పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శేఖర్‌ తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ముద్రించబడిన పుస్తకాలను బుధవారం పాఠశాలలో ఆవిష్కరించారు. ప్రముఖ కవులు రాసిన కవితల పక్కన తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని కవితలు ఉండటం ఎంతో సంతోషంగా ఉందని ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ప్రవళికను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్‌ఎం విద్యావతమ్మ, శ్రీనివాసులు, జమీల్‌, రాధిక, కవిత, భాస్కర్‌, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద సోమవారం బహుజన సమాజ్‌ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు చిన్నరాములు, మిద్దె మహేష్‌ పాల్గొని మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం బహుజన సమాజ్‌పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిన్నయ్యయాదవ్‌, రాములు, ప్రధాన కార్యదర్శిగా మైబూస్‌ తదితరులను ఎన్నుకున్నారు.

మహిళలు పురుషులతో సమానంగా రాణించాలి



అధ్యాపకులను సన్మానిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

వనపర్తి టౌన్‌: మహిళలు పురుషులతో సమానంగా చదివి ఎదగగలరని నిరూపించిన సావిత్రీబాయి పూలే స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేమని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి అన్నారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీవాణి కళాశాలలో మహిళా అధ్యాపకులను శాలువాతో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16, 17వ శతాబ్దంలోనే చదువు విలువ తెలుసుకొని మహిళలు చదువుకోవాలని పూలే పాటుపడితే, నేడు గ్రామాలు, పట్టణాల్లో పలు చోట్ల ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేస్తున్నారని విస్మయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి, ప్రజావాగ్గేయకారుడు రాధాకృష్ణ, మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ రాధాకృష్ణ, మాజీ కౌన్సిలర్‌ చీర్ల విజయ్‌చందర్‌, కాంగ్రెస్‌ నాయకులు ఉమ్మళ్ల రాములు, బాబా, దివాకర్‌, రోహిత్‌, చరణ్‌, దిలీప్‌, సందీప్‌, హరి శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

పాన్‌గల్‌: తెలంగాణ పట్టభద్రుల నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నిరుద్యోగ యువతకు ఉచితంగా పంపిణీ చేసే గ్రూప్‌–4కు సంబంధించిన మెటీరియల్స్‌కు పేర్లు నమోదు చేసుకోవాలని తెలంగాణ పట్టభద్రుల నిరుద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి యాపాల శేఖర్‌, రాష్ట్ర అధ్యక్షుడు మండ్ల రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెటీరియల్స్‌ను నియోజకవర్గ కేంద్రం కొల్లాపూర్‌ పంపిణీ చేస్తారని, ఈనెల 7వ తేదీ వరకు యువత పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94942 67842, 91777 06626ను సంప్రదించాలన్నారు.

వలంటీర్‌కు వేతనం అందజేత

పెబ్బేరు: మండలంలోని పాత సూగూర్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయ వలంటీర్‌ ఎండీ రెహనాకు బుధవారం ఒక నెల వేతనం రూ.9వేలు ఇచ్చినట్లు పాఠశాల చైర్మన్‌ మద్దిలేటియాదవ్‌ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని కోరారు.



ఆర్టీసీ పరిరక్షణకే జీపుయాత్ర



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్‌ (శ్రీరంగాపురం): కార్మికుల సంక్షేమ బోర్డు సాధన, ఆర్టీసీ పరిరక్షణ కోసం జీపుయాత్ర చేపట్టామని తెలంగాణ పబ్లిక్‌ ప్రైవేట్‌ రోడ్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి సూర్యవంశం రాము అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3న ఖమ్మం నుంచి ప్రారంభమై.. 11న సంగారెడ్డిలో యాత్ర ముగింపు ఉంటుందన్నారు. డీజిల్‌, గ్యాస్‌, పెట్రోల్‌ ధరలను తగ్గించాలని కోరారు. మోటారు వాహన చట్టం 2019లో సవరణలు చేయాలని, కేరళ రాష్ట్రం తరహా సవారీ యాప్‌ను దేశవ్యాప్తంగా తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పెబ్బేరు మండల కేంద్రంలో సుభాష్‌ చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం జరిగే సభకు డ్రైవర్స్‌, ఓనర్స్‌ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డ్రైవర్స్‌ యూనియన్‌ నాయకులు రాజు, బాలేమియా, నవీన్‌, హఫీజ్‌, రమేష్‌, నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ



గోపాల్‌పేట: పెరటి కోళ్ల పెంపకం ద్వారా గ్రామీణులు అదనపు ఆదాయం పొందాలని జెడ్పీటీసీ భార్గవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో రూరల్‌ బ్యాక్‌యార్డు పౌల్ట్రీ ఆధ్వర్యంలో 39 మంది లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతోందని, వాటన్నింటిని సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం అభ్యున్నతి సాధించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కోదండం, మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు రవి, బంగారయ్య, పశువైద్య స్బిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి మహోత్సవం



ఇరుముడి పూజలో మాలధారులు



శబరిమలకు బయలుదేరుతున్న మాలధారులు

ఆత్మకూర్‌: పట్టణంలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో ఇరుముడి మహోత్సవాన్ని బుధవారం గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుర చైర్‌పర్సన్‌ గాయత్రి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రవియాదవ్‌, వైస్‌చైర్మన్‌ విజయభాస్కర్‌ రెడ్డి, మాజీఎంపీపీ డాక్టర్‌ శ్రీధర్‌గౌడ్‌, గాడి లక్ష్మీనారాయణ, గడ్డమీది శ్రీను ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిశేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి, భక్తిగేయాలను ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఊరేగింపుగా పరమేశ్వరస్వామి చెరువు వరకు కాలినడకన దీక్షాపరులకు సాగనంపారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎస్టీడీ శ్రీను, అనిల్‌, శ్రీనివాస్‌, గోవర్ధన్‌, రఘు, చందు, తిర్మలేష్‌, గాడి లక్ష్మణ్‌, హర్షగౌడ్‌, తోటరవి, శ్రీకాంత్‌, నాని, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసమే శిక్షణ తరగతులు

ఖిల్లాఘనపురం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రాధ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఎంసెట్‌–2023 శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వ కళాశాలలో చదివే పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకుండా ఉండేందుకే ఈ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మాధవి, సౌజన్య, శోభ, కృష్ణయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రికెట్‌ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట: క్రీడాకారులు గెలుపు, ఓటమిలను సమానంగా చూడాలని కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్‌ పోటీలను సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంచుకొని క్రీడల్లో రాణించాలని, అప్పుడే మంచి గుర్తింపు వస్తుందన్నారు. క్రీడల్లో రాణిస్తూ భవిష్యత్తు తరం క్రీడాకారులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలపారు. కార్యక్రమంలో ధనుంజయ్‌గౌడ్‌, ఏబీవీపీ నాయకులు రవి, మహేష్‌, శ్రీను, లక్ష్మణ్‌, ప్రశాంత్‌ ఉన్నారు.

జాబ్‌కార్డులకు ఆధార్‌ అనుసంధానం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్‌: మండలంలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సంబంధించిన జాబ్‌కార్డులకు ఆధార్‌ అనుసంధానం త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేషనల్‌ మొబైల్‌ మానిటరింగ్‌ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్‌) యాప్‌లో కూలీల హాజరు ఉదయం, మధ్యాహ్నం ఒక్కసారి మొబైల్‌ ద్వారా పంపించాలన్నారు. ఇలా హాజరు పంపిస్తేనే కూలీలకు కూలి డబ్బులు అందుతాయన్నారు. హాజరు విషయంపై ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లకు అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో పాటు గ్రామాల్లో ప్రతి నిత్యం పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రంకు పెట్టెలు అందజేత



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్‌

మదనాపురం: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చొరవతో మదనాపురం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివే 320 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ట్రంకు బాక్సులు మంజూరయ్యాయి. బుధవారం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్‌ చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు.

విద్యార్థులకు సన్మానం

సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్‌ ఫెయిర్‌లో మదనాపురం గురుకుల పాఠశాల విద్యార్థులు రాంచందర్‌, అనిల్‌ పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో విద్యార్థులను ఎంపీపీ, జెడ్పీటీసీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ రవీందర్‌, సర్పంచ్‌ రాంనారాయణ, బీఆర్‌ఎస్‌ యూత్‌ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్‌, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు కుమార్‌, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, సంఘం నాయకులు

పాన్‌గల్‌: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 2023 టీఎస్‌ యూటీఎఫ్‌ క్యాలెండర్‌, డైరీలను బుధవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌ సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి , ఎంపీటీసీ హైమావతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌, సంఘం నాయకులు శేఖర్‌, శంకర్‌నాయక్‌, మురళీ, లక్ష్మణ్‌గౌడ్‌, గోవింద్‌ నాయక్‌, బద్రూనాయక్‌, మాధవచారి పాల్గొన్నారు. దీంతో పాటు పీఆర్‌టీయూ టీఎస్‌ క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బౌద్ధారెడ్డి, జయంత్‌రెడ్డి, బండి శ్రీను, వెంకటయ్య, సుజీత్‌, రాములు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంలో క్రికెట్‌ నెట్‌ ఏర్పాటు చేస్తాం

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ క్రీడా మైదానంలో క్రికెట్‌ ప్రాక్టీస్‌ కోసం నెట్‌ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించామని మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జీఎస్‌ గోపి, కమిషనర్‌ మహమ్మద్‌ఖాజా తెలిపారు. ఇప్పటికే వాలీబాల్‌, లాంగ్‌జంప్‌, హైజంప్‌, ఖోఖో కోర్టును ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం వాకింగ్‌ ట్రాక్‌ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్రికెట్‌ క్రీడాకారుల విన్నపం మేరకు మైదానంలో క్రికెట్‌ ప్రాక్టీస్‌ చేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ యార్డు మాజీ వైస్‌ చైర్మన్‌ నాగభూషణం గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ, జంతు ప్రదర్శన



వనపర్తి టౌన్‌: పర్యావరణం, జంతువులపై జిల్లా కేంద్రంలోని అనూస్‌ స్కూల్‌లో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు, చెట్లు, పూల మొక్కలు, జంతువుల వేషం వేసుకొని ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్‌ వెంగళ్‌రెడ్డి, కరస్పాండెంట్‌ అరుణ వెంగళ్‌రెడ్డి, మేనెజింగ్‌ డైరెక్టర్‌ అనుజ్ఞారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణం, జంతువులపై అవగాహన ఉంటేనే పర్యావరణ బాగుకు పాటు పడగలరని చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు కొత్తగా స్టీల్‌ ప్లేట్స్‌, గ్లాస్‌, కర్రి కప్పులను బుధవారం అందించామని హస్టల్‌ వార్డెన్‌ బెనర్జీ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహ విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులను అధికారుల సూచలనతో అందిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు వాల్‌ క్లాక్‌, మిర్రర్‌, మాట్రీస్‌, పిల్లోస్‌, పిల్లో కవర్స్‌, వాలీబాల్‌ను అందించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంను మెను ప్రాకారం అందిస్తున్నామన్నారు. పదోతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని వార్డెన్‌ తెలిపారు.